# మూ గ క త

**పూడిపెద్ది వెంకటరమణయ్యగారు**

వెనుకటి మేనకా వృత్తాంతం జ్ఞాపకానికి వస్తూంది. ఆమె దేవతాకన్య: ఏంచేసినా చేసి ఉంటుంది. కాని భూలోకంలో కూడా ఇలాటి ఉదంతాలు జరుగుతాయా అని పించింది. అయితే వెనుకటి కథకూడా యీ లోకంలోదే! విశ్వామిత్రు డిక్కడివాడేగదా!

'తల్లి' అనగానే ప్రేమచేత ఒళ్ళు గగురు పొడుస్తుంది. కళ్ళు చెమ్మగిల్లుతాయి. మన స్సంతో నిండుగా ఉంటుంది. కాని దీనికి కారణం ఆమెకు బిడ్డమెడగల ప్రేమే కదూ! ఆప్రేమ తీసే స్త్రే తల్లికీ నేలపాషాణానికీ ఏమిటి భేదం?

రెండాకులలో చుట్టబెట్టేసి ఆబిడ్డను పొదలోపడేసి యే అంబరవీధికో ఎగసి పోయిందా తల్లి. పాప మా పసికూన మిల మిలా మెరస్తూన్న కళ్ళతో చిటుకాళ్ళు కదపుతూ, చిన్ని నోరు సవరించుకొంటూ ఆ ఆకులలో సంచలిస్తూంది.

ఆపొదలోనే అలా దినాలుతోపాటు ఆమె కూడా పెరుగుతూంది. విడిన పూలనుండి రాలిన పూదేనె చినుకు లాహారిస్తూ, మంచు నీటిబొట్లు త్రాగుతూ మెల్లగా ప్రాకి వెళ్ళి వెళ్ళి క్రిందికి వంగిన కొమ్మలచివురా కందు కొని తింటూ అక్కడికక్కడే తిరుగుతూ, కొంచెం పెరిగి పెద్దదయిందామె సన్యాసి బ్రతుకు; సాత్వికాహారం; స్వచ్ఛంగజీవనం; అలాసాగిపోతే ఎంతబాగుండును! పాడు మన స్సలా నిలబడుతుందా? కొంచెం బాహ్యలోకాన్ని చూచింది. ఆచెట్ల పూలయందం చూచింది. ఆరేకుల సొగసూ వన్నెలూ, చిలుగుపనీ, ఇవన్నీ చూచింది

"అయ్యో! ఈ పువ్వెంత అదృష్టవంతు రాలో! స్వేచ్ఛగా చెట్టుకొమ్మకొనను నిల బడి నవ్వు మొగంతో లోకాన్ని చూచి ఆనం దిస్తూంది. నేను కూపస్థమండూకంలాగు ఈ చీకటిలో ఈపొదమాటున జీవిస్తున్నాను. పుట్టు సన్యాసిలాగు బూది పూతెక్కిన ఈ యొడలితో ముడిచికొన్న యీ మొగంతో నేలనే తిరుగుతూ, ఏలాలిత్యమూ ఎరుగ కుండ ఇలాపడి ఉండలేను. ఇంత మానవృత్తి బూని ఆకలమలుదిని జీవితం గడుపుకొంటూ న్నా ఆదైవం నన్ను దయదలచిందికాదు. ఈ మలిన జీవనమే బుచ్చుకొమ్మని గట్టిగ నుదుట వ్రాసిపడేసింది నన్నిలోకంలోను: అయ్యో! అంత విశాలమయిన ఆకాశాన అన్నిపిట్టలు సంచరిస్తూన్నాయే! జగత్తంతా చూస్తు న్నాయే! ఆచిత్రాలూ, ఆజిలుగుపనులూ, ఆవన్నెలూ, ఆవైభవాలూ, అన్నీచూచి ఆనందిస్తున్నాయే! నాకెందుకు కూడదూ ఆ అవకాశం? ..ఏదీ?... లేదు! ఎవరిస్తారు? నిర్భాగ్యపు పుట్టుపుట్టిన నాకు నిలువనీడే నిధానమయిపోయిందే! ఏంచెయ్యడం? ఆ దేవదేవునెలా సందర్శించడం? నాకెలా స్వాధీనుడవుతా డతడు! ఛీ! ఈ జీవనం పయిని విరక్తిగలుగుతూంది నాకు! బైరాగి నైపోతా. నిద్రాహారాలు మానేసి నిలువు గాళ్లమీద తపస్సు చేస్తా!! చూస్తా దేవుడు నాకు ప్రత్యక్ష్యం కాక ఏంచేస్తాడో."

అనుకొని ఆమె ఆపాదమొదట మౌన ముద్ర వేసికొని పాదు కదలకుండ అహోరాత్రాలు జపం చేయడం మొదలుపెట్టింది. కొన్నాళ్ళయేసరికి పూర్వం వాల్మీకిమీద పెద్దపుట్టలు పోసేసినట్లు, ఆమె కనబడకుండా ఆమెచుట్టూ, పట్టులూ, పుట్టలూ, కూడా అల్లేశాయి. ఆమె నిర్విఘ్నతపస్సమాధిలో నిలిచిపోయింది.

ఇదంతా ఎందుకు? లోక సౌందర్యాన్ని అనుభవించడానికట! అనంతములయిప్రాకే ఈ సృష్టిసౌందర్యపరంపరలన్నీ ఎవరికి గోచరిస్తాయి! ఎవరు వానినన్నిటినీ స్వేచ్ఛగా అనుభవింపగలరు? మీరు మిక్కిలి అందగలరు? కాని లోకంమాత్రం అలా ఊరుకుంటుందా? వెట్టిజీవులను ఇలాటివింతలతో ఆడిస్తుంది. రంభాపరిరంభణంకోసం యజ్ఞాదివ్రతనియమాలతో కాలంగడిపే ముసలిసోమయాజికంటె వెట్టిదా మన కథానాయిక?

ఏమో, ఆమే చెబుతుంది తరువాతి వృత్తాంతమంతానూ, ఆపుట్టలో, ఆపట్టులో, ఏంజరిగిందో మనకేం తెలుస్తుంది.?

"నేనలా తపస్సమాధిలో తదేకధ్యానంతో కన్నులు మూసికొని, లోకాన్ని మరచిపోయి నిశ్చలనై నిర్జీవమైనట్టు పాషాణప్రాయంగా అలాపడిఉన్నాను. అలా గెన్నాళ్లున్నానో, ఎలా గున్నానో, తలుచుకుంటే, నాకే ఆశ్చర్యం వేస్తూంది. ఆశ్చర్యంరాదూ ఆభగవంతునిచేతా? ఏది ఎలాజరిగిందో ఎవడు చెప్పగలడు?

ఒకనాడంతట యోగ నిద్రనుండి నేను త్రుళ్ళిపడి మేల్కొన్నాను. అంధకారమయమయిన నా ఆవరణలో నొకవింత వెలుగు పొడమింది. ఆఁ! ఇది దివ్యకాంతి! నాతపమును మెచ్చికొని దైవం నాకు ప్రత్యక్షమౌతూంది. సరే! ఈ అమూల్యావకాశాన్ని విడువకుండా నాకు కావలసిన వరాలిచ్చి మరీ వెళ్లుమంటూ నాదేవుణ్ని!! ఊరకే మొగం చూపించి పారిపోతే ఒప్పుకోను!! నాతపోమహిమచేత వానిని మొలకొంగున పట్టుకొని ముంగిట నిలబెట్టి మరీ అడుగుతాను: నేనడిగిన వరాలిచ్చేదాకా వదలను!! రానీ! ఆ ముఖారవిందం నాకంటబడితే అప్పుడుంది. ఇప్పుడేలా! అదుగో! ఆపట్టుచించుకొని మరీ వస్తున్నాడు. రమ్మను నాతో హాస్యాలు కాదు!!

ఆతడు వచ్చేడు. నాఒడలు మెల్లగ తన చేత్తో నిమిరేడు. కొనవ్రేళ్ళతో దువ్వేడు "బిడ్డా! నీతపము మెచ్చికొన్నాను. నీకు కావలసిన వరములడుగు"మని నాచెవిలో చెప్పినట్లయింది, నేను 'స్వేచ్ఛ, సౌందర్యం' అన్నాను తొందర తొందరగా "సరే ఇచ్చేను పొందు"మన్నాడు. నేను కళ్ళు విప్పేను. అంతా అంధకారం! అయ్యో! అప్పుడే ఇంతలోనే ఆతడు పారిపోయాడు. ఆముఖ మొకపరిచూచానుకాను. ఆసౌందర్యం ఒక్కసారి అనుభవించానుకాను. ఆపాదాంభోకతూరి స్పృశించలేకపోయాను. ఏవో అడుగుతే ఆతడిచ్చానంటే అంతే చాలుననుకొన్నాను. ఏమిచ్చేడు? ఏమో! ఆ అంధకారంలో

నాకేం తెలియలేదు. పైకేలాగయినా ప్రాకిపోయి ఆదేవుడు నాకేమిచ్చేడో చూడాలన్న తొందర హెచ్చయిపోయింది. మెల్లగా ఆ పుట్ట పగిలించుకొని ఆపట్టు చీల్చుకొని పైకి త్రోవ చేసికొనుటకు ప్రయత్నించేను. ఎవరో తెరచినట్టు వింతగా ఆత్రోవ విడింది. పైకి వెడలేను. ఒడలు తేలికగాఉంది. శరీరమంతా విరుస్తూంది. విప్పేను; కనులు మిరుమిట్లు గొన్నాయి పూవు రేకులలాగుంది నాశరీర సౌందర్యం. ఆహా! అవన్నెలు ఆజిలుగు ఆ చిత్రరచన ఏపువ్వులోఉంది?

అయింది పూలగర్వం అడగింది ఆకొమ్మకొనను నిలబడి అదియేమి గర్వించింది! దానికంటె ఎక్కువ అందం నాకువచ్చింది... అన్నట్టు స్వేచ్ఛకోరుకొన్నానే.... పైకెగసి చూస్తాను. కుప్పించియెగిరేను గాలిలో విమానంలాగు తేలిపోయాను. అంతరాళాన రంగుల కాగితాల గాలిపటంలా ఎగసేను. ఆ పువ్వు దగ్గరకుపోయి దాని గర్వం ఇప్పుడు పరీక్షించుకున్నాను. అది నారెక్కకొననయి నా పోలలేకపోయింది. నేను కొంతసేపలా నిలబడేసరికి అది నాఅందంచూచి ఓర్వలేక నారెక్కలనిండా తన కేసరాల ధూళి చల్లేసింది. నాకు కొంచెం కోపంవచ్చి ఆ ప్రక్కనున్న చిగురుదగ్గరకుపోయి నిలచాను. నాకప్పుడాలోచనమీద నాలోచన పొరలి వస్తూంది. ఆక్రొన్ననవైపే కొరకొరా చూస్తూ నిలచిపోయాను. ఏమిటి దీనియెక్కువ! నాకంటె దీనికేమి విశేషాలున్నాయి. వాసన మధువు; మార్దవం; ఇవి నాలోలేవు. అందుచేతనే తుమ్మెద నాతో మంతనాలాడదు; నన్ను ప్రేమతో కౌగిలించికోదు. ఈపూవును చూచి పరవశమున పాడుతూ అది దాని పొత్తువిడునదు; నన్ను అది కన్నెత్తి చూడనయినా చూడదు. కాంతాలోకాని కీపూలమీద నెంతప్రేమ! ఎంతగౌరవం! వాళ్ళు నాటిని తలమీద పెట్టుకుంటారు! నన్నెవరలా గౌరవిస్తారు. నేనిలా యీఅడవిలో పేరూ ప్రతిష్ఠా లేకుండా సమసిపోవడమే కాబోలు ఏమో! ఆదైవము ముఖాముఖి నాకడ నిలచినపుడు కావలసినవన్నీ అడుగక ఇప్పుడన్నీ కావాలంటే యెలా వస్తాయి?

ఇదే నాకడసారికోర్కె:—పూవువలె నేను కూడా కాంతాలోకంలో గౌరవంపొందాలి.'

ఇప్పుడాకోర్కె సఫలీకృతమౌతూందేమో! పట్టుపేలికలతో ఆకుచిలుక ఆకృతిని రచించి రెక్కలమీద చెమ్కీపనులుచేసి సింగారవతులు జడలమీద పొందుపరచుకుంటున్నారు. అది చూచి సీతాకోక చిలుక ఆనందించదూ?

### తపోమహిమ